క్లుప్తంగా

ఫిరంగిపురంలో భారీ వర్షం



ఫిరంగిపురం: మండలంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండగా ఉన్నా ఒక్కసారిగా మబ్బులు కమ్మి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో మురుగు నీరు పారుదల సరిగా లేక రోడ్లపైకి వచ్చి చేరింది. ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద నున్న దుకాణాల్లో మురుగునీరు చేరి ఇబ్బందులు పడ్డారు. క్రీస్తు నగర్, ఎస్టీ కాలనీ, కొత్తపేట లోతట్టు ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిలిచి ప్రజలు నడిచేందుకు కూడా వీలు లేక అవస్థలు పడ్డారు.

వాలీబాల్ జిల్లా జట్టుకు విద్యార్థి ఎంపిక



మంగళగిరి: ఈ నెల 17న వేజెండ్ల జిల్లా పరిషత్ హైస్కూలులో జరిగిన వాలీబాల్ అండర్ 17 సెలక్షన్స్‌లో సీకే జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి కట్టిపోగు మహేంద్ర ఎంపికయ్యాడు. ఈ నెల 21, 22 ,23 తేదీల్లో శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే అంతర్ జిల్లాల వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడు. మహేంద్రను శనివారం కళాశాల కరస్పాండెంట్ జంజనం పాండు రంగారావు, ప్రెసిడెంట్ చింత క్రింది కనకయ్య ప్రిన్సిపల్ రత్నబాబు, ప్రధానోపాధ్యాయురాలు ఏవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

సీపీఎం నాయకుడు ముత్యాలరావు మృతి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణలోని సీపీఎం సీనియర్ నాయకుడు సోలా ముత్యాలరావు (56) అనారోగ్యంతో శనివారం ఉదయం మృతి చెందారు. సీపీఎం నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు. విజయవాడ నాయకులు బాబూరావు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు జొన్నా శివశంకరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, జి. సుబ్బారెడ్డి, కొట్టే కరుణాకర్, బర్నబాస్, అమ్మిశెట్టి రంగారావు, కాట్రగడ్డ శివరామకృష్ణయ్య, శివన్నారాయణ, కాజా వెంకటేశ్వరరావు, దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మేడికొండూరు: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం శనివారం గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మేడికొండూరు సీఐ నాగూర్ మేరా సాహెబ్ వివరాల మేరకు.. గ్రామ పరిధిలోని ఎన్ఎస్పీ కెనాల్‌లో గుర్తుపట్టలేని స్థితిలో 60 నుంచి 65 సంవత్సరాల లోపు వయస్సు గల వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని సీఐ తెలిపారు. వీఆర్ఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఆచూకీ ఎవరికైనా తెలిస్తే తమను సంప్రదించాలన్నారు. మృదేహాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అలరించిన గోవింద నామ సంకీర్తన

తెనాలి: స్థానిక నెహ్రూ రోడ్డులోని శ్రీ గోవర్ధనస్వామి, శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి శ్రీ హరినామ సంకీర్తన బృందం ఆధ్వర్యంలో గోవింద నామ సంకీర్తన నిర్వహించారు. రెండున్నర గంటలు సాగిన కార్యక్రమంలో పెరవలి వంశీకృష్ణ ,అందె బాల చంద్రమౌళి, రాజేశ్వరి, తన్మయి, మాదల నాగఅర్చన, కొప్పరపు అనితమాధవి, తూనుగుంట్ల దుర్గామల్లేశ్వరి, కొత్తమాసు పుష్పలత, విష్ణుప్రియ, వేమవరపు లక్ష్మీనరసింహారావు, సాములూరి శివశంకరరాజు, టీవీఎస్ శాస్త్రి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని శ్రీ రుక్మిణీ సమేత గోవర్ధనస్వామి, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు వేజండ్ల విద్యార్థులు ఎంపిక

చేబ్రోలు: మండలంలోని వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంపిక పోటీలు నిర్వహించారు. హైస్కూల్‌కు చెందిన మట్టుపల్లి సుమశ్రీ, బింగినపల్లి మనీష, చల్లగిరి గీతా మాధురి, మట్టుపల్లి జయసంజన, పఠాన్ షాహీదా ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ -17 బాలికల వాలీబాల్ పోటీలలో మొత్తం 12 మంది జట్టు సభ్యులలో వేజండ్లకు చెందిన ఐదుగురు ఎంపికయ్యారు. అక్టోబర్ 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందూపురంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నారు. వాలీబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్ఎం టి.విజయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ రబియా నష్రా, పీఈటీ టి.వెంకటేశ్వరరావు అభినందించారు.



నాణేనికి మరో వైపు..!

రూ.10 నాణెం చలా'మనీ' అవుతుంది



- ఉద్దేశపూర్వకంగా తీసుకోని కొందరు వ్యాపారులు
- బరువు, పరిమాణం కారణంగా మరికొందరి అనాసక్తి
- నాణెం మారకంపై ఆర్బీఐ కీలక ఆదేశాలు
- వాణిజ్య సముదాయాల్లో తిరస్కరిస్తే ఫిర్యాదుకు అవకాశం
- మరింత విస్తృత అవగాహన అవసరమంటున్న ప్రజలు

తాడేపల్లిరూరల్ : మార్కెట్‌లో పది రూపాయల నాణెం కష్టాలు కొనసాగుతున్నాయి. రూపాయి, రెండు రూపాయలు, ఐదు రూపాయల నాణేలకు పెద్దగా సమస్యలు చెప్పని వ్యాపారులు, రూ.10 కాయిన్ తీసుకోవడానికి సుముఖత చూపడం లేదు. నాణెం బరువు కారణంగా.. ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామంటూ సాకులు చెబుతున్నారు. ప్రజలు నాణెం తీసుకుంటున్నప్పటికీ టీ కొట్లు, కిరాణా దుకాణాలు, రోడ్ సైడ్ వ్యాపారులు తీసుకోవడం లేదని చెబుతున్నారు. 'నోటు ఉంటే ఇవ్వండి.. కాయిన్ వద్దంటూ ముఖం మీదే చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కానీ, నలిగిపోయిన, చిరిగిపోయిన స్థితిలో ఉన్న పది రూపాయల నోటును వెంటనే తీసుకుంటున్నారని చెబుతున్నారు.

రూ.10 నాణెం చెల్లుతుంది

పది రూపాయల నోట్ల స్థానంలో ఐదేళ్ల కిందట రూ.10 నాణెంను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందుబాటులోకి తీసుకొచ్చింది. 2019లో స్టాండర్డ్ డిజైన్‌తో మూడు రకాలుగా విడుదల చేసింది. పది రూపాయల నోటు మన్నిక లేకపోవడంతో సంవత్సరాల పాటు చలామణిలో ఉండేలా వాటి స్థానంలో ఈ కాయిన్స్‌ను తీసుకొచ్చింది. కానీ, వాటిని వాడడానికి మొదట్లో ప్రజలు ఇష్టం చూప లేదు. దేశ వ్యాప్తంగా వీటి వినియోగం ఎలా ఉన్నా రాష్ట్రంలో ప్రజలు తిరస్కరించారు. ఆర్‌బీఐ చట్టాల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో రూ.10 నాణెం తప్పకుండా మారకంగా తీసుకోవాలి. ఈ కాయిన్ అన్ని చోట్లా అమల్లో ఉందని, అన్ని చోట్ల చెల్లు బాటు అవుతోందని ఇటీవల ఆర్బీఐ స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఆయా బ్యాంకుల్లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చని స్వయంగా ఆర్బీఐ పలుమార్లు ప్రకటించింది. దీంతో ప్రజల్లో కొంత అవగాహన కలిగి ఇప్పుడిప్పుడే పది నాణెంను తీసుకుంటున్నారు. అయితే పెట్రల్ బంకులు, వ్యాపారులు, చిరు వ్యాపారులు అవగాహన లేక ఈ కాయిన్‌ను తిరస్కరిస్తున్నారు.

అందరూ తీసుకోవాల్సిందే



పది రూపాయల నాణెం అందరూ వినియోగించాల్సిందే. ఎవరు తీసుకోకపోయినా అది చట్ట వ్యతిరేకం. బ్యాంకుల్లో నోట్లకు బదులు కాయిన్స్ ఇస్తున్నాం. చెల్లవు అనేది పుకారు మాత్రమే. ప్రతి బ్యాంకులో ఈ కాయిన్స్ తీసుకుంటున్నారు.
– మురళీజ్యోతి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్

మేము ఇస్తుంటే తీసుకోవడం లేదు



వ్యాపార లావాదేవీల్లో ఎవరికైనా రూ.10 కాయిన్స్ ఇస్తుంటే తీసుకోవడం లేదు. నోట్లు చిరిగి వస్తున్నాయి. ఆ నోట్లు వ్యాపారంలో బిజీగా ఉన్నప్పుడు ఎవరైనా ఇస్తే తీసుకుంటున్నాం. తిరిగి ఏదైనా కొనడానికి ఆ నోట్లు ఇస్తే తీసుకోవడం లేదు. రూ.10ల నాణెంపై బ్యాంకు అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలి. – మధు, టీ స్టాల్ వ్యాపారి

బుసక టిప్పర్ల భయం



పైకప్పు లేకుండా ప్రయాణిస్తున్న టిప్పర్లు

మంగళగిరి: రాజధాని అమరావతికి వెళ్తున్న బుసక టిప్పర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుసక టిప్పర్ల నిండా బుసర నింపుకుని పైన ఎలాంటి పైకప్పు లేకుండా తిరుగుతున్నాయి. దీంతో టిప్పర్ల నుంచి వచ్చే దుమ్ము ప్రజలను ఇబ్బంది పెడుతుండగా ద్విచక్రవాహనదారుల కళ్లల్లో పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. టిప్పర్ల వేగానికి రోడ్ల వెంట ఇతర వాహనదారులు వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. వేగంగా, ఇష్టానుసారం టిప్పర్లను డ్రైవర్లు నడుపుతూ ప్రజలను, వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇటీవల ఆటోనగర్‌లో ఒక ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొట్టగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. నిడమర్రు రోడ్డులోని మరో కారుని ఢీకొట్టగా ప్రమాదం చోటు చేసుకుంది. టిప్పర్ల కారణంగా ప్రతి రోజు ఏదో ఒక చోట చిన్నపాటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి టిప్పర్ల వేగాన్ని నిరోధించడంతో పాటు పైకప్పులతో నడిచేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్ : వ్యవసాయ రంగ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న విజయవాడలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి, చిలువూరు గ్రామాల్లో రైతులను కలసి మాట్లాడారు. వ్యవసాయ రంగంలో కేరళ వామపక్ష ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు అనుకూల విధానాలను వివరించారు. రాష్ట్ర సదస్సులో ఎంబీ రాజేష్ పాల్గొని ప్రసంగిస్తారని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పలు సంఘాల జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, ఎం.నాగమల్లేశ్వరరావు, నాయకులు జి.యోహాను, వై. బ్రహ్మేశ్వరరావు, బి.చిరంజీవి, ఎస్.బాబూరావు, మరియదాసు, కె.కోటేశ్వరరావు, కె.జోజి, ఎం.అంజయ్య, డి.నాగేశ్వరరావు, జి.బాలచంద్రుడు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కంతంరాజు కొండూరులో శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ షేక్ జబిన్ పాల్గొన్నారు. ఈమని గ్రామంలో రూ.35లక్షల, చింతలపూడిలో రూ.10 లక్షలు, దుగ్గిరాలలో రూ.55 లక్షల వ్యయంతో, ఆయా గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ నేత కేశినేని అనిత, పసుపులేటి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎ. శ్రీనివాసరావు, విస్తరణాధికారి కెజె నెహ్రూ, పంచాయతీ రాజ్ డీఈఈ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


మల్లఖంబలో 12 మంది విద్యార్థులకు శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తెనాలి అర్బన్: స్థానిక కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 12 మంది మల్లఖంబ క్రీడల్లో శిక్షణ పొందారని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చిలకా సుందరరావు తెలిపారు. బాపట్లలోని వివేకానంద భవనంలో ఈ నెల 17 నుంచి జరిగిన శిక్షణలో మలఖంబ విశ్వ గురువుగా పిలబడే కోచ్ ఉదయ విశ్వనాథ్ దేశ్ పాండే వద్ద విద్యార్థులు శిక్షణ పొందినట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు సరైన భావ వ్యక్తీకరణ అలవర్చుకోవాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు సరైన భావవ్యక్తీకరణ, సాంకేతిక నైపుణ్యాలను అలవరుచుకుని అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని ప్రముఖ హాస్య నటుడు జెన్నీ తెలిపారు. శనివారం నగరశివారుల్లోని లాంలోని చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు భావవ్యక్తీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని చెప్పారు. విద్యార్థులు కేవలం మార్కులపై మాత్రమే కాకుండా ఇతర వ్యక్తిత్వ వికాసం, సమాజంపై అవగాహన, తదితర అంశాలపైనా దృష్టి సారించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణ అందించేందుకు తమ కళాశాల ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా అతిథిని కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు.

రికార్డులు పూర్తి చేయాలి



ఫిరంగిపురం: మండలంలోని అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు పూర్తి చేసి సోషల్ ఆడిట్ టీంకు సహకరించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్, డీఆర్‌డీఏ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి సంబంధించిన పనులు పరిశీలనకు గ్రామ స్థాయిలో సభలు నిర్వహించారన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల నాణ్యత వివరించే రికార్డులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. త్వరలో నిర్వహించే సోషల్ ఆడిట్‌కు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌బీ రామచంద్రరావు, పీఆర్ఏఈ శ్రీనివాస్, ఉపాధి హామీ ఏపీవో జయకుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సేవాభావంతో వైద్య సేవలు అందించాలి

పెదకాకాని: ప్రతి ఒక్కరూ సేవాభావంతో వైద్య సేవలు అందించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ సెంటర్, పెదకాకాని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డాక్టర్లు, ఏఎన్ఎంలు విధుల్లో తప్పక ఉండాలన్నారు. తొలుత మండలంలోని నంబూరు–3 ఆరోగ్య ఉపకేంద్రంలోనూ, యాదవపాలెం అంగన్‌వాడీ సెంటర్‌లో జరిగిన టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. టీకాలు తీసుకున్న గర్భిణి వివరాలు , పిల్లల వివరాల రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం పెదకాకాని ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి పిల్లల టీకాల నిల్వ ఉంచే ఐఎల్ఆర్, డీప్ ఫ్రిజ్, హాజరు పట్టిక, ఓపీ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ వీఎస్ఆర్ శాస్త్రి, పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ప్రవీణదీప్తి, సూపర్ వైజర్ పుసులూరు శ్రీను పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధురాలి మృతి

కాకుమాను: పాము కాటుతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన పెదనందిపాడు మండలం పెదనందిపాడులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన నూర్ బాషా మస్తాన్‌బీ(60) ఇంట్లో వంటింటి పనులు చేసే సమయంలో పాము కాటుకు గురైయ్యింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

– సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను మంత్రి నారా లోకేష్ పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ కోరారు. శనివారం సాయంత్రం బ్రహ్మానందపురంలోని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారాన్ని చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, తుడిమెల్ల వెంకటయ్య, బూరగ వెంకటేశ్వర్లు, వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు స్టీఫెన్, కె. ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

తప్పుడు పనిలో తన్నులాట

ఇసుక అక్రమ రవాణా విషయంలో దాడులు



సురేష్ అనే యువకుడ్ని చితకబాదుతున్న హరికృష్ణ, రామకృష్ణ తదితరులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి, రాజధాని పలు గ్రామాల్లో కంకర, గ్రావెల్ ఇతర వస్తువుల దొంగతనాలకు మరిగిన బాబాయి అబ్బాయిలు..ఇప్పుడు దాడులకూ తెగబడుతున్నారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వీరు.. ఉచిత ఇసుక విధానాన్ని ప్రభుత్వం తీసుకురావడంతో తమ హవా కొనసాగించేందుకు తహతహలాడుతున్నారు. తమకు ఎవరూ అడ్డులేకుండా చూసుకునేందుకు మరో ఇసుక మాఫియా వ్యక్తిపై విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు.. కార్పొరేషన్, రాజధాని పరిధిలో గ్రావెల్, ఐరన్ చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్న మహానాడుకు చెందిన రౌడీషీటర్ వల్లెపు హరికృష్ణ, బాబాయిగా చెప్పుకునే చిర్రావూరుకు చెందిన రామకృష్ణ మూడు రోజుల క్రితం మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలో ఇసుక అక్రమ రవాణా చేసేందుకు పొక్లెయిన్‌తో సహా అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో యర్రబాలేనికి చెందిన సురేష్ అనే అతను కూడా అక్కడికి వచ్చాడు. ముందు రోజు అతను ఇసుక అక్రమ రవాణా చేస్తుండగా పోలీసుల పట్టుకున్నారు. దీంతో డంప్ చేసిన ఇసుక ఉందా లేదా అని చూసేందుకు అర్ధరాత్రి సమయంలో సురేష్ అక్కడికి వెళ్లాడు. వల్లెపు హరికృష్ణ అక్కడే ఉండటతో ఇద్దరి మధ్య వాగ్వాదం నడిచింది. హరికృష్ణ బాబాయిగా చెప్పుకునే రామకృష్ణకు ఫోన్ చేసి తన వాళ్లను తీసుకుని రావాలని చెప్పారు. రామకృష్ణ తన అనుచరులతో అక్కడికి చేరుకుని, సురేష్‌ను చితకబాదాడు. 'నీ ముందే లారీలు లోడ్ చేసి తీసుకెళ్తాం..నీకు దిక్కున్న వారితో చెప్పుకో అంటూ వార్నింగ్ ఇచ్చి ఇసుక లారీలతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై సురేష్ మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సదరు బాబాయి అబ్బాయిల కోసం మంగళగిరి రూరల్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. గతంలో వీరు అనేక మందిని ఇదేవిధంగా బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వంలో తమకు తిరుగు లేదంటూ, సీఎంఓ ఆఫీసులో పరిచయాలు ఉన్నాయని, ఎవరు ఇసుక దందాకు పాల్పడినా తమ కిందే పనిచేయాలంటూ ట్రాక్టర్, లారీ యజమానులకు హుకుం జారీ చేశారు.

కార్మికులకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



కార్మికుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ కృష్ణా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు దొంతిరెడ్డి వేమారెడ్డి శనివారం తన మద్దతును తెలియజేశారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు, వారి కుటుంబ సభ్యులు దొంతిరెడ్డి వేమారెడ్డిని కలిసి ఆయన మద్దతును కోరారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ 32 సంవత్సరాల క్రితం యాజమాన్యం అక్రమంగా ఫ్యాక్టరీని లాకౌట్ చేసిందన్నారు. దీంతో 330 మంది కార్మికులు వీధిన పడ్డారని చెప్పారు. కార్మికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా సెంట్రల్ లేబర్ క్రిమినల్ కోర్టు, హైకోర్టు వారు ఫ్యాక్టరీ భూములు వేసి రూ.43 వేల కోట్లు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించినా ఇప్పటి వరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, భూములు కొనుగోలు చేసిన వారు కానీ నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. వారికి నష్టపరిహారం లభించేవరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ కార్మిక నాయకులు కూరపాటి స్టీఫెన్, బూరగ అంకయ్య, ఎం.ఆశీర్వాదం, కె. ఆదినారాయణ,ఆర్. ఇశ్రాయిల్, ఎం. శారద, బొందలపాటి నవనింద, వై.రమాదేవి ఉన్నారు.

హక్కులతో.. ఉన్నత స్థానాలకు



మాట్లాడుతున్న ఏఎన్‌యూ ప్రొఫెసర్ కొండలరావు

మంగళగిరి: సమాజంలో బాలికలు హక్కులను వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ డి.కొండలరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ, చైల్డ్ ప్రొటక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ పి.గీతాపద్మజ మాట్లాడుతూ బాలికలపై వివక్షత అనేది కుటుంబం నుంచే ప్రారంభమవుతుందన్నారు. బాల బాలికలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిసేలా తల్లితండ్రులు పెంచాలన్నారు. పట్టణ సీఐ రవీంద్ర మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు నిరోధించాలంటే బాలికలు ధైర్యంగా ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ సీనియర్ న్యాయవాది కె.కాళిదాసు, సిస్టర్ ఉదయ, డాక్టర్ స్నేహరాజ్, కారుమంచి రామారావు, అంగనవాడి సూపర్‌వైజర్స్ పి.రత్నకుమారి, శ్రీదేవి, సిస్టర్స్ రూబి, వసుంధర, సిబ్బంది నాగమణి, బి విజయలక్ష్మి, పోతురాజు, ఇశ్రాయిల్ పాల్గొన్నారు.

పట్టణం పరిశుభ్రంగా ఉండాలి



కొప్పురావులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఆలీంబాషా

మంగళగిరి: పట్టణంలో ఎక్కడా చెత్త కుప్పలు కనిపించకూడదని, పరిశుభ్రతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంటీఎంసీ కమిషనక్ ఆలీం బాషా పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు. శనివారం పట్టణంలోని 11వ వార్డు కొప్పురావు కాలనీలో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఉదయం 5 గంటల నుంచే వీధులన్ని పరిశుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. చెత్తకుండీల్లోని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మురుగు నీరు పారుదల ఉండేలా కాల్వల్లోని సిల్టును ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, పారిశుద్ధ్య విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంక్ ఫుడ్‌తో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు శనివారం చిర్రావూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జంక్ ఫుడ్ అనర్థాలపై అవగాహన కల్పించారు. వర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన అలవాట్లు, పోషకాహారంతో జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చని చెప్పారు. ప్రస్తుతం మానవుని జీవన శైలి పూర్తిగా మారిపోయిందని, మొబైల్ వచ్చిన తర్వాత సోషల్ మీడియాలో సమయమే తెలియకుండా పోయిందన్నారు. ఆహారపు అలవాట్లు కట్టు తప్పాయని, శారీరక శ్రమ, లేదా వ్యాయామం లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాలంటీర్లను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ వి.జోనితిన్, సమన్వయ కర్త పి.సురేష్‌లను వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.